క్లుప్తంగా

కోనా వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న కోనా వేంకటేశ్వర స్వామి

సి.బెళగల్:మండల పరిధిలోని కృష్ణదొడ్డి గ్రామ కొండపై వెలసిన శ్రీ కోనా వెంకటేశ్వర స్వామికి శనివారం పూజారులు ప్రత్యేక పూజలను నిర్వహించారు.శనివారం స్వామికి ప్రీతికరమైన రోజుతో కావడంతో కొండపై ఆలయంలోని భూదేవి, అలివేలిమంగమ్మ సమేత శ్రీ కో నా వెంకటేశ్వర స్వామి మూలవిగ్రహాలకు అభిషేక పూజలతో పాటు ప్రత్యేక పుష్ప, పత్రాలతో అలంకరించి పూజా కార్యక్రమాలు చేపట్టారు. గ్రామస్తులు ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

'నాడు-నేడు' పనులు సకాలంలో పూర్తి చేయండి



ఉపాధ్యాయులతో చర్చిస్తున్న ఎంఈఓ ఆదామ్‌బాషా

సి.బెళగల్: మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో మనబడి నాడు - నేడు అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని ఎంఈఓ ఆదామ్‌బాషా ఆదేశించారు. శనివారం మండలంలోని ముడుమాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి, జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల సీనియర్ ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు గౌడ్‌తో పనులపై చర్చించి, నిధుల వినియోగంపై సూచనలు చేశారు. పనులను నాణ్యతగా చేపట్టాలని, సకాలంలో పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చేందుకు ఉపాధ్యాయులు, పీఎంసీ సభ్యులు కృషి చేయాలని సూచించారు. అదేవిధంగా పాఠశాలలో జగనన్న గోరుముద్దలో భాగంగా అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

పిల్లలను తప్పక బడికి పంపాలి



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పాణ్యం: బడిఈడు పిల్లలందరూ తప్పక బడిలో ఉండాలని, ఇందుకు తల్లిదండ్రులు సహకరించాలని ఎంఈఓ-2 సుబ్రహ్మణ్యం కోరారు. శనివారం పాణ్యం సచివాలయం-4 పరిధిలో జీఈఆర్ సర్వే వందశాతం పూర్తి కావడంతో గిరిజన బాలుర పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ఎంఈఓ-2 మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పిల్లలందరూ బడిలో ఉండాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా బడి బయటి పిల్లలను గుర్తించి, బడిలో చేర్పించామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణానాయక్, చంద్రామవతమ్మ తదితరులు పాల్గొన్నారు.


ఎస్టీయూ వజ్రోత్సవాలను విజయవంతం చేద్దాం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్టీయూ నాయకులు

గూడూరు: కర్నూలులో జనవరి 12,13వ తేదీల్లో జరగనున్న ఎస్టీయూ 75 వసంతాల వేడుకలను జయప్రదం చేయాలని ఎస్టీయూ అధ్యక్షుడు ఎస్. గోకారి పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ రంగ సమస్యలపై చర్చ, భవిషత్ కార్యాచరణ ఉంటుందని పేర్కొన్నారు. అనంతర వజ్రోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లా ఉపాధ్యక్షుడు కె.హనుమంతు, జిల్లా కౌన్సిలర్ సుబ్బరాయుడు, ఉపాధ్యాయులు జయలక్ష్మి, సంధ్యారాణి, వెంకటరాముడు, తులసిరెడ్డి తదితరులు ఉన్నారు.

కేసీకి 159 క్యూసెక్కుల నీటి విడుదల



గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు 159 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు శనివారం అధికారులు తెలిపారు. డ్యాంలో ప్రస్తుతం 0.881 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

సేవలందిస్తూ.. ప్రాణం పోస్తూ!



ఈ చిత్రంలో ఓ వ్యక్తి చేతిలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో స్ట్రెచర్‌పై పడుకున్న మహిళ పేరు రమ్య. కర్నాటక రాష్ట్రం, గుగ్గారెడ్డిపల్లెకు చెందిన ఈమె బతుకుదెరువు కోసం కొద్దిరోజుల క్రితం పాణ్యం పట్టణానికి వచ్చింది. రోడ్లపై పడేసిన ప్లాస్టిక్ వస్తువులను సేకరించి, విక్రయించుకుంటూ జీవనం చేస్తుంది. ఈ క్రమంలో ఈ అభాగ్యురాలుతో స్నేహంగా తిరిగే ఓ వ్యక్తి మద్యం మత్తులో ఆమెపై దాడిచేయగా తలకు తీవ్రగాయమై అపస్మారకస్థితికి చేరుకొంది. ఆ సమయంలో అటుగా వెళ్లుతున్న కొందరు 108 వాహనానికి ఫోన్ చేశారు. స్పందించిన 108 సిబ్బంది అక్కడి చేరుకొని సకాలంలో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి ప్రాణాపాయం నుంచి కాపాడారు.



ఓర్వకల్లులో సేవలకు సిద్ధంగా ఉంచిన 108 అంబులెన్స్ వాహనం

- వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక 108 సేవలు విస్తృతం
- గర్భిణులకు, ప్రమాద బాధితులకు సత్వర సేవలు అందిస్తున్న సిబ్బంది
- 40 శాతం గర్భిణులకు వాహనంలోనే సుఖ ప్రసవం
- నాలుగేళ్లలో పాణ్యం నియోజకవర్గంలో 28,800 మందికి సేవలు



ఓర్వకల్లు : ఆపదలో ఉన్న వారిని ఆదుకునేదిశగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 108 అంబులెన్సు సేవలను ప్రవేశపెట్టారు. ఆ మహనీయుడి ఆశయాలకు అనుగుణంగా ఆయన తనయుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగాన్ని మరింత బలోపేతం చేశారు. ఇందులో భాగంగానే మారుమూల పల్లెలకు సైతం అంబులెన్స్ సౌకర్యం ఉండేలా విస్తృతం చేశారు. ప్రతి మండలానికి ఒక అంబులెన్సు చొప్పున నియోజకవర్గంలో 4 మండలాలకు అంబులెన్స్‌లను కేటాయించి, సేవలను మరింత పటిష్టపరిచారు. పురిటి నొప్పులతో తల్లడిల్లిపోతున్న తల్లులకు, రోడ్డు ప్రమాదాలకు గురై ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాతున్న వ్యక్తుల పాలిట 108 సేవలు ఆపద్బాంధవుడిలా నిలిచాయి.

24 గంటలు అందుబాటులో..

108 సిబ్బంది 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఫోన్ చేసిన 15 నుంచి 20 నిమిషాల్లోనే బాధితుల వద్దకు చేరేలా దిశానిర్దేశం చేసింది. మాతాశిశు మరణాల సంఖ్య తగ్గేలా, ప్రభుత్వ ఆసుపత్రులలోనే గర్భిణులు ప్రసవించేలా జాగ్రత్తలు తీసుకున్నారు. అందకు అనుగుణంగా స్త్రీల వైద్య నిపుణులను అందుబాటులోకి తెచ్చారు. ప్రతి అంబులెన్స్‌లో అత్యాధునిక వైద్య పరికరాలతో పాటు,అనుభవజ్ఞులైన ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషిన్ (ఈఎంటీ), పైలట్‌లను నియమించి, ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. ఈ క్రమంలోనే సిబ్బంది ఆపత్కాలంలో అమ్మకు అండగా ఉంటున్నారు. సురక్షిత ప్రసవాల ద్వారా తల్లిబిడ్డ ప్రాణాలను కాపాడుతున్నారు. అత్యవసర సమయాల్లో ఆసుపత్రి వెళ్లే మార్గం మధ్యలోనే ప్రసవాలు చేస్తున్నారు.

నాలుగేళ్లలో 28,800 మందికి సేవలు

ప్రతి రోజూ వందల కిలోమీటర్ల దూరం రుయ్..రుయ్ అంటూ 108 వాహనాలు తిరుగుతున్నాయి. నియోజకవర్గంలో గత నాలుగున్నర సంవత్సరాలలో కలిపి సగటున 28,800 మందికి సేవలు అందించినట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. అందులో 40 శాతం మంది గర్భిణులకు అంబులెన్స్ సిబ్బంది 108 వాహనంలోనే పురుడుపోసి తల్లిబిడ్డ ప్రాణాలను సంరక్షించారు. రోడ్డు ప్రమాదాలకు గురైన వారు, కడుపు నొప్పి, పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నాలకు పాల్పడేవారు, ఇలా అత్యవసర వైద్య చికిత్సల కోసం మిగత 60 శాతం మందిని సకాలంలో సమీపంలోని ఆసుపత్రుల వద్దకు తీసుకెళ్లి ప్రాణాపాయస్థితి నుంచి కాపాడారు.

సకాలంలో స్పందించారు



పురిటి నొప్పులతో సతమతమవుతున్న సమయంలో 108 సిబ్బంది సకాలంలో స్పందించారు. ఇంట్లో ఎవరూలేని సమయంలో పురిటి నొప్పులతో బాధపడుతున్నాను. ఆ సమయంలో దిక్కుతోచక వెంటనే 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశా. స్పందించిన 108 సిబ్బంది పది నిమిషాల్లోనే వచ్చి, ప్రాథమిక వైద్యం అదించారు. ఆ తర్వాత ఓర్వకల్లులో ఉన్న సీహెచ్‌సీలో చేర్పించి, అత్యవసర సేవలు అందించారు. ఆసుపత్రి వైద్యులు మెరుగైన వైద్యసేవలు అందించి, సురక్షితంగా ప్రసవం చేశారు.

– మౌనిక , సోమయాజులపల్లె గ్రామం, ఓర్వకల్లు మండలం

108 సిబ్బందికి కృతజ్ఞతలు



ఆపదలో వున్న నన్ను ఆదుకున్న 108 సిబ్బందికి కృతజ్ఞతలు. నెలలు నిండిన నాకు ఒకరోజు అకస్మాత్తుగా పురిటి నొప్పులు రావడంతో 108కు ఫోన్ చేశాను. కొద్దిసేపటికే ఓర్వకల్లు 108 అంబులెన్స్ సిబ్బంది మా ఇంటివద్దకు చేసుకొని వాహనంలోనే వైద్య సేవలు అందించడంతో పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చాను. పురిటినొప్పులతో బాధపడుతున్న నాలాంటి ఎంతోమంది గర్భిణులకు 108 అండగా నిలుస్తోంది.

– శాంతకుమారి, హుసేనాపురం గ్రామం, ఓర్వకల్లు మండలం

బాల్య వివాహాలతో ఎన్నో అనర్థాలు



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

గడివేముల: బాల్య వివాహాల వల్ల ఎన్నో అనర్థాలు, ఆరోగ్య సమస్యలు వస్తాయని సీఎస్ఆర్ మేనేజర్ జి.రవికుమార్ అన్నారు. శనివారం జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ లిమిటెడ్, కైలాసత్యర్థి చిల్డ్రన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గడివేముల జెడ్పీ స్కూల్‌లో బాల్య వివాహాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్య వివాహాల వల్ల సమాజంలో ఆడపిల్లలు ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని, ఈ దురాచారాన్ని అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కైలాసత్యర్థి చిల్డ్రన్ ఫౌండేషన్ కౌన్సిలర్ ఉషారాణి చిన్న వయసులో వివాహాలు చేయడం వల్ల తలెత్తే ఆరోగ్య సమస్యలను వివరించారు. జిందాల్ సిబ్బంది లక్ష్మీనారాయణరెడ్డి, భాస్కర్, విజయలక్ష్మీ, నవ యూత్ అసోసియేషన్ డైరెక్టర్ నరసింహులు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ వెంకట తిమ్మారెడ్డి, హెచ్ఎం విక్టర్ ఇమ్మనియేలు పాల్గొన్నారు.

వీఆర్ఏ మృతిపై విచారణకు వినతి

ఓర్వకల్లు: మండలంలోని మీదివేముల గ్రామానికి చెందిన వీఆర్ఏ(తలారి) వెంకటకృష్ణ మృతిపై సమగ్ర విచారణ జరపాలని వీఆర్ఏల సంఘం మండల అధ్యక్షుడు, సీఐటీయూ జిల్లా నేత శ్రీధర్ విజ్ఞప్తి చేశారు. శనివారం స్థానిక తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, ఎస్ఐ రాజారెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెంకటకృష్ణకు బావిలోపడి మృతి చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. అతని మృతిపై పలు అనుమానాలు ఉన్నాయన్నారు. విచారణ జరిపించి మృతుని కుటంబానికి న్యాయం చేయాలని కోరారు. వీఆర్ఏ సంఘం నాయకులు మధుశేఖర్, మహబూబ్‌బాషా, జయన్న, రామాంజనేయులు, ఇస్మాయిల్, అక్బర్‌బాషా, లక్ష్మీదేవి, శశికళ తదితరులు ఉన్నారు.



ఎస్ఐ రాజారెడ్డికి వినతి పత్రం ఇస్తున్న వీఆర్ఏలు

హైవేపై ప్రమాదాలు.. ముగ్గురికి గాయాలు



తడకనపల్లె క్రాస్ వద్ద లారీని ఢీకొన్న ఆటో

కల్లూరు: ఉలిందకొండ పోలీసు స్టేషన్ పరిధిలోని తడకనపల్లె క్రాస్ వద్ద 44వ జాతీయ రహదారిపై పెను ప్రమాదం తప్పింది. శనివారం డోన్ వైపు నుంచి కర్నూలు వైపు వెళ్తున్న అశోక్ లీలాండ్ ట్రాలీ ఆటో అదుపు తప్పి రోడ్డు మధ్యలోని డివైడర్‌ను దాటి కర్నూలు నుంచి డోన్ వైపు వెళ్తున్న లారిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న ఇద్దరికి గాయ్యాలయ్యాయి. గాయపడిన వారిని కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాద సంఘటనపై ఉలిందకొడ పోలీసులు విచారిస్తున్నారు.

బస్సును ఢీకొన్న లారీ

ఉలిందకొండ పోలీసు స్టేషన్ పరిధి 44వ జాతీయ రహదారి ఏర్రకత్వ క్రాస్ వద్ద బస్సును లారీ ఢీకొన్న ఘటన చోటుచేసుకుంది. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న టీఎస్ఆర్టీసీ బస్సును వెనక వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్‌కు గాయాలుకాగా కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వైఎస్సార్‌సీపీ మండల కమిటీల నియామకం

పాణ్యం : వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పాణ్యం నియోజకవర్గానికి సంబంధించి పార్టీ మండల కమిటీలను ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించి ఎంపికైన వారి జాబితాను శనివారం పార్టీ కేంద్ర కార్యాలయం విడుదల చేసింది.

పార్టీ కమిటీల వివరాలు..

పాణ్యం మండలం

ప్రెసిడెంట్‌గా కరుకణార్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్లుగా సద్దల శ్రీనివాసరెడ్డి, మన్నె సాహెబ్‌గారి ఉసేన్ సాతో పాటు మరో 24మందికి పదవులు కేటాయించారు.

గడివేముల మండలం

ప్రెసిడెంట్‌గా యేలంపల్లి శివరామిరెడ్డి, వైస్ ప్రెసిడెంట్లుగా మిట్టమీది పెద్ద డొలసా, యూ. అనిల్‌కుమార్‌రెడ్డి తో పాటు మరో 24 మందికి పదవులు దక్కాయి.

ఓర్వకల్లు మండలం

అధ్యక్షుడిగా శ్రీరెడ్డి చెన్నారెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎ. సోమశేఖర్‌రెడ్డి,కె.రామాజినేయులు, బిసి. రవితో పాటు 24 మందికి పదవులు కేటాయించారు.

కల్లూరు మండలం

మండల ప్రెసిడెంట్‌గా కురాకుల పెద్ద ఈశ్వరయ్య, వైస్ ప్రెసిడెంట్లుగా దండు వేణుగోపాల్‌రెడ్డి, ఆర్. శ్రీనివాసులుతో పాటు మరో 24 మందికి పార్టీ పదవులు దక్కాయి.

కర్నూలు మున్సిపాలిటీ క్లస్టర్-1

క్లస్టర్ ప్రెసిడెంట్‌గా బి. భీమశంకర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్లుగా ఖాజ, కె. శివసంజీవరెడ్డితో పాటు 24 మందికి పదవులు కల్పించడం జరిగింది.

కర్నూలు మున్సిపాలిటీ క్లస్టర్-2

ప్రెసిడెంట్‌గా సన శ్రీనివాసులు, వైస్ ప్రెసిడెంట్లుగా ఎం. తిరుపాల్, సంపతి సుబ్బారెడ్డి తో పాటు మరో 24 మందికి పదవులను కట్టబెట్టారు.

నైపుణ్యాలను వెలికి తీసేందుకే 'ఆడుదాం..ఆంధ్ర'



లద్దగిరిలో కబడ్డీలో ఆడుతున్న క్రీడాకారులు



ఓర్వకల్లులో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

కోడుమూరురూరల్:గ్రామీణ క్రీడాకారుల్లో దాగివు న్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర పోటీలను నిర్వహిస్తోందని ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. శనివారం మండలంలోని లద్దగిరి, గోరంట్ల గ్రామాల్లో క్రీడా పోటీలను ప్రారంభించారు.

ఓర్వకల్లు: ఆడుదాం..ఆంధ్రా క్రీడా పోటీల్లో పోటీల్లో భాగంగా శనివారం ఓర్వకల్లు, లొద్దిపల్లె హైస్కూల్ మైదానాల్లో వాలీబాల్ పోటీలు నిర్వహించారు.

వైఎస్ జగన్ పాలనలోనే సామాజిక సాధికారత



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు

- చేసిన మేలు ప్రజలకు చెప్పేందుకు బస్సు యాత్ర
- వచ్చే నెల 4న కల్లూరులో నిర్వహణ
- సన్నాహక సమావేశంలో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే సామాజిక సాధికారత సాధ్యమని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా అన్ని వర్గాల ప్రజలకు ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తోందన్నారు. చేస్తున్న మేలును తెలియజేసేందుకు పార్టీ సామాజిక సాధికార బస్సు యాత్రకు శ్రీకారం చుట్టిందన్నారు. యాత్రలో భాగంగా వచ్చే నెల 4న కల్లూరులో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం ఎమ్మెల్యే తన స్వగృహంలో నియోజకవర్గ పరిధిలోని కల్లూరు అర్బన్, కల్లూరు గ్రామీణ, ఓర్వకల్లు, పాణ్యం, గడివేముల మండలాలకు చెందిన నాయకులతో బస్సు యాత్ర విజయవంతానికి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తుందన్నారు. గత ప్రభుత్వాలు బడుగు బలహీన వర్గాలను పట్టించుకోలేదని, వారిని ఓటర్లుగా మాత్రమే చూశారన్నారు. నేడు తమ పార్టీ వారికి వివిధ పదవులు ఇచ్చి గౌరవిస్తుందన్నారు. 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి చైర్మన్లు, డైరెక్టర్లను నియమించిందన్నారు. స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం సీట్లు కేటాయించిన ఘనత తమ పార్టీకే దక్కుతుందన్నారు. నాలుగున్నరేళ్ల వైఎస్ఆర్‌సీపీ పాలనలో రాష్ట్రంలో ప్రతి గడపకు లబ్ధి చేకూరిందన్నారు. గత టీడీపీ పాలనకు ప్రస్తుత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనకు మధ్య తేడాను గమనించాలన్నారు. ఎన్నికల సమీపిస్తుండటంతో టీడీపీ నాయకులు మాయమాటలు చెబుతున్నారని, అయితే, వారిని ప్రజలు నమ్మరన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి తమ పార్టీని ప్రజలు పట్టం కడతారని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేణుక, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ మీదివేముల ప్రభాకర్‌రెడ్డి, కర్నూలు జిల్లా మైనార్టీ అధ్యక్షుడు జిలాన్ బాషా, నాలుగు మండలాలకు చెందిన ఎంపీపీలు, జెడ్పీటీసీలు, కల్లూరు అర్బన్ పరిధిలోని కార్పొరేటర్లు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షులు, జేసీఎస్ కన్వీనర్ ఇన్‌చార్జ్‌లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు, మహిళలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రామయ్య తాత రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: మండల పరిధిలోని తడకపల్లె గ్రామంలో రామయ్య తాత తిరునాల సందర్భంగా శనివారం సాయంత్రం రథోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

మండల పరిధిలోని ఉలిందకొండ గ్రామంలో శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం శనివారం కనుల పండువగా జరిగింది.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

మూఢనమ్మకాలను వీడాలి

కల్లూరు: మూఢనమ్మకాలను పాటించరాదని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు సుధీర్ అన్నారు. శని వారం పెద్దపాడులోని దామోదర సంజీవయ్య ప్ర భుత్వ బాలిక ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు,బి.ఈడి చాత్రోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆక్రమణలను అడ్డుకోవాలి



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పాణ్యం: అర్అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యంతో బంక్‌లు ఇష్టానుసారంగా వెలుస్తున్నాయని.. అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పాణ్యంలోని ప్రభుత్వ కళాశాల వద్ద విద్యార్థులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నేత ప్రతాప్ మాట్లాడుతూ.. పాఠశాల ఆవరణ ఆనుకుని అర్అండ్‌బీ స్థలాల్లో ఇష్టానుసారంగా షెడ్‌లు వేస్తూ అందులో మరుగుదొడ్లు నిర్మాస్తున్నారన్నారు. దీని వల్ల పాఠశాలలోకి దుకాణాల వ్యర్థాలు వస్తున్నాయని తెలిపారు. గతంలో ఫిర్యాదు చేయగా తాత్కాలికంగా పర్యవేక్షణ చేసిన అధికారులు ఆ తర్వాత వాటిని వదిలేశారన్నారు. ఇదే అదునుగా చూసుకుని భారీ దుకాణాలు వెలుస్తున్నాయని చెప్పారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అక్రమ నిర్మాణాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

పట్టుబడిన దొంగలు

- రూ.20.88 లక్షల విలువ చేసే నగలు, నగదు స్వాధీనం
- ఆటోలు, ద్విచక్ర వాహనాలు సీజ్

కర్నూలు : కర్నూలు మండల పరిధిలోని వివిధ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడి తప్పించుకు తిరుగుతున్న 12 మంది దొంగలను కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు అరెస్టు చేసి కటకటాలకు పంపారు. ఇందులో ముగ్గురు మైనర్లు కూడా ఉన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసుకుని సీఐ శ్రీరాం ఆధ్వర్యంలో నిందితుల కోసం గాలిస్తుండగా కర్నూలు మండలం దిన్నెదేవరపాడు గ్రామ పొలిమేరలోని రాగమయూరి రిసార్ట్స్ వద్ద ఉన్న బీడు భూముల్లో కొంతమంది అనుమానాస్పదంగా ఉన్నట్లు సమాచారం అందింది. శనివారం వల పన్ని అక్కడ ఉన్న 12 మందిని అదుపులోకి తీసుకుని విచారించగా వారి నేరాల చిట్టా బయటపడింది. ఓర్వకల్లుకు చెందిన కురువ ప్రవీణ్, కల్లూరు మండలం పెద్దపాడు గ్రామానికి చెందిన బోయ మణికుమార్, కర్నూలు వడ్డెగేరికి చెందిన సాయిప్రసాద్, స్వామిరెడ్డి నగర్‌కు చెందిన మహేష్ బాబు, గుంటూరు టౌన్ కొత్తపేటకు చెందిన జొన్నలగడ్డ అశోక్ (ప్రస్తుతం కర్నూలు శివారులోని నంద్యాల చెక్‌పోస్టు వద్ద నివాసం), కల్లూరులోని శ్రీనివాసరెడ్డి నగర్‌కు చెందిన చెంచు వెంకటేష్, కల్లూరులోని చెంచునగర్‌కు చెందిన చెంచు నాగేంద్ర, కర్నూలు ఎస్ఏపీ క్యాంప్ సమీపంలోని లేబర్ కాలనీకి చెందిన దాడిపోగు కల్యాణ్ తదితరులు జట్టుగా ఏర్పడి పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడినట్లు అంగీకరించారు. జల్సాలకు అలవాటు పడి ఖర్చుల కోసం మొదట చిన్నచిన్న దొంగతనాలు చేస్తూ తర్వాత ఇళ్ల ముందు పార్క్ చేసిన వాహనాలు, ఇళ్ల దొంగతనాలు చేసినట్లు వారు విచారణలో అంగీకరించారు.

వీరి నేరాల చిట్టా...

- మామిదాలపాడు శివారులోని ఫామ్ ట్రీ విల్లా నివాసంలో ఉంటున్న రఘునాథ్‌రెడ్డి ఇంట్లో ఈనెల 19వ తేదీన దాదాపు రూ.3 లక్షలు విలువ చేసే డైమండ్ ఉంగరాలు, బంగారు చైన్ చోరీ చేశారు.
- పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలోని ప్రిన్సిపాల్ చాంబర్‌లో ఈ ఏడాది ఫిబ్రవరి 8వ తేదీన రూ.2.44 లక్షలు తస్కరించారు.
- వెంగన్నబావి సమీపంలోని అంబేడ్కర్ నగర్‌లో నివాసముంటున్న పెరుమాళ్ల సరోజమ్మ ఇంట్లో ఈనెల 25వ తేదీన 9 తులాల బంగారం, 70 తులాల వెండి, రూ.1.27 లక్షల నగదు చోరీ చేశారు.
- బాలాజీ నగర్‌లో ఈనెల 21వ తేదీన షేక్ షాలిమియా, మాధవరెడ్డిలకు చెందిన మూడు మోటర్ సైకిళ్లు, ఒక ఆటో చోరీ చేశారు.
- భూపాల్ నగర్‌లో మహిళకు సంబంధించిన బంగారు చైన్‌ను తస్కరించినట్లు విచారణలో నిందితులు అంగీకరించడంతో వారిపై కేసు నమోదు చేసి వారి వద్ద నుంచి రూ.20.88 లక్షలు విలువ చేసే నగలు, నగదు రికవరీ చేసినట్లు సీఐ శ్రీరాం తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ తెలిపారు.